క్లుప్తంగా

యువగళం హామీలు ఉత్తుత్తివే..!



తెరుచుకోని జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీ

సాలూరు: ఎన్నికల సమయంలో యువగళం లో భాగంగా నారా లోకేష్ పట్టణంలో బహిరంగ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సూపర్‌సిక్స్ పథకాలతో పాటు, ముఖ్యంగా జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీ తెరిపించి కార్మికులను ఆదుకుంటామని, దేశంలో అతి తక్కువ పన్నులు లారీలకు విధించే భాద్యత తాను తీసుకుంటానని, జీఓ 3 ద్వారా గిరిజనులకు న్యాయం చేస్తామని, సుమారు 16 సంక్షేమ పథకాలు గిరిజనులకు ఇస్తామని, ఐటీడీఏలను బలోపేతం చేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్నా ఈ హామీల అమలుకు అడుగులు పడుతున్న దాఖలాలు లేవు.

గర్భిణుల ఆరోగ్యమే లక్ష్యం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ ఉషా

సీతానగరం: గర్భిణుల ఆరోగ్య భాగ్యమే తమ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఉషా అన్నారు. పీహెచ్‌సీలో గురువారం గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రతి నెలా ఆరోగ్యపరమైన సమస్యలుంటే తక్షణమే తనిఖీలు చేయించుకోవాలని అన్నారు. హైరిస్క్‌తో ఉన్న గర్భిణులను జిల్లా కేంద్రాస్పత్రికి తరించి మెరుగైన వైద్య సేవలందిస్తామన్నారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఐఓ చిరంజీవులు

సీతానగరం: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఐఓ (ల్యాండ్ సర్వే – సెటిల్‌మెంట్ శాఖ) చిరంజీవులు అన్నారు. మండలంలోని తామరఖండిలో తహసీల్దార్ ఉమామహేశ్వర రావు, గుచ్చిమిలో డీఐఓ చిరంజీవులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు గురువారం నిర్వహించారు. గుచ్చిమిల డీఐఓ చిరంజీవులు మాట్లాడుతూ రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూములకు సంబంధించిన సమస్యలు సదస్సుల ద్వారా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. భూ సమస్యలు ఏవైనా ఫిర్యాదు ఇవ్వాలన్నారు. గుచ్చిమిలో 30 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. వీటిని దశల వారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, వీఆర్ఓలు, డిజిటల్ సహాయకులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.


గంజాయి సాగుపై డ్రోన్‌తో పర్యవేక్షణ



డ్రోన్ ఫ్లయింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న రూరల్ ఎస్ఐ

పార్వతీపురం టౌన్: ఆంధ్రా – ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి, సారా అక్రమ రవాణాను నిరోధించేందుకు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ప్రారంభిస్తున్నట్టు పార్వతీపురం రూరల్ ఎస్ఐ సంతోషికుమారి తెలిపారు. రావికోన పంచాయతీ ఒడిశా సరిహద్దు గ్రామాలైన చందలంగి, బట్టివలస, కొత్తవలస, రంగాలగూడ గ్రామాల్లో ఆమె గురువారం పర్యటించి డ్రోన్ సహాయంతో సరిహద్దు ప్రాంతాలను పరిశీలించారు. పోలీసు సాంకేతిక బృందం తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా హౌస్ హోల్డ్ సర్వే



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రామ్‌గోపాల్

మక్కువ: హౌస్‌హోల్డ్ సర్వే చురుగ్గా జరిపించాలని జిల్లా సచివాలయాల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి రామ్‌గోపాల్ సూచించారు. మండలంలోని శంబర, మక్కువ, కవిరిపల్లి సచివాలయాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌లు తరుచూ పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు. ఎన్‌పీసీఐ సర్వేను వేగవంతంగా చేపట్టాలన్నారు. పనివేళల్లో సచివాలయ ఉద్యోగులు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులోఉండాలన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించరాదన్నారు. అత్యవసర పరిస్థితిల్లో బయటకు వెళ్లాల్సి వస్తే, ఔటర్ రిజిష్టర్‌లో వివరాలను పొందుపరచాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

అన్నదాతకు వెన్నుపోటు

కూటమి నేతలు అన్నదాతకు వెన్నుపోటు పొడిచారు. నాడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేడు విస్మరించారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు అందజేస్తామన్న హామీ గాలి కొదిలేశారు. పార్వతీపురం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ఇచ్చిన హామీలను వదిలేశారు. దీంతో రైతాంగంతో పాటు అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.





పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న నారా లోకేష్(ఫైల్)

- ఊసెత్తని 'అన్నదాత సుఖీభవ'
- పంట బీమా ప్రీమియం రైతులే చెల్లించాలట..
- ఇచ్చిన హామీలన్నీ ఉత్తుత్తివేనా..!

పార్వతీపురం టౌన్: ప్రతీ రైతుకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు అందజేస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తయి..ఖరీఫ్ సీజన్ ముగిసినా కూటమి నేతలు ఆ ఊసెత్తడం లేదు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ ఉత్తిదేనా! అని రైతులు ప్రశ్నిస్తున్నారు. పంట నష్టపోయిన రైతులకు గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఉచిత పంటల బీమా అమలయ్యేది.. ఏ సీజన్‌కు ఆ సీజన్‌లోనే నష్టపోయిన రైతులకు బీమా మొత్తం చెల్లించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం రద్దు చేసి ఆ భారం రైతుల నెత్తిపై వేసి ఆర్థిక భారం మోపింది. అధికారంలోకి రాగానే పార్వతీపురం నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరిస్తామని స్వయానా నారా లోకేష్ ఎన్నికల వేళ పార్వతీపురంలో ప్రచారం చేశారు. ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు చదివితే అందరికీ రూ.15వేలు తల్లికి వందన పేరిట ఇస్తామన్నారు. నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తాం.. ప్రతీ మహిళకు నెలకు రూ.1500 ఖాతాలకు జమ చేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కల్పిస్తామని, ఇలా మేనిఫెస్టోలో చేర్చి భారగా ప్రచారం చేశారు. తీరా అధికారం చేపట్టాక హామీలన్నీ గాలికొదిలేశారు. ఖరీఫ్ సాగు ముగిసింది. రైతాంగం పంటలను దళారులకు విక్రయించే పరిస్థితి నెలకొంది. అయినా వారికి సాయం ఇవ్వలేదు. సూపర్ సిక్స్ పేరిట ప్రకటించిన ఏ ఒక్కటీ నేటికీ అమలు కాలేదు. అంతకు ముందు అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసింది. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని, కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నియోజకవర్గ సమస్యలను మరిచారా..!

- అధికారం చేపట్టిన నెల రోజుల్లో డంపింగ్ యార్డు తరలిస్తామని ఇచ్చిన హామీ గాలి కొదిలేసారు.
- పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీనిచ్చి ఆరు నెలలైనా అతీగతీలేదు.
- సీతానగరం వంతెన పూర్తి చేస్తామన్నారు..నేటి వరకు కనీసం ఆ పనులకు సంబంధించి ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయలేదు.
- నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పిస్తామని హామీనిచ్చారు...అదీ మరిచారు.

అన్నదాతకు అండగా నిలవాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా జూన్ మాసంలో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇంకా రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయకపోవడంతో రైతులు సాగుకు ఇబ్బందులు పడుతున్నారు.

– ఎస్.రామకృష్ణ, రైతు, సీతానగరం

తల్లికి వందనం ఏదీ!



నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కష్టపడుతూ జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటున్నాను. తల్లికి వందనం కింద నా ఇద్దరు పిల్లలకు రూ.15వేలు చొప్పున ఇవ్వాలి. ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరోలా మాట మార్చడం సరైంది కాదు.

– శ్రావణి, తల్లి పార్వతీపురం

ఉచిత ప్రయాణ మెప్పుడో..



అధికారంలోకి వస్తూనే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని దండోరా వేసి మరీ చెప్పారు. వచ్చి ఆరు నెలలైంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నాం. ఇచ్చిన హామీని త్వరగా అమలు చేయాలి. ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరోలా మాటమార్చడం సరైంది కాదు.

– రమణమ్మ, పార్వతీపురం

- కొనుగోలు కేంద్రంలో దళారులకే పెద్దపీట
- సరఫరా కాని గోనె సంచులు
- అన్నదాతపై నిర్లక్ష్యం

అన్నదాతకు దగా..



ముమ్మరంగా నూర్పులు చేస్తున్న రైతులు



దళారులు కొనుగోలు చేసిన ధాన్యం లోడు

సాలూరు రూరల్: కూటమి పాలనలో రైతులు దగా పడుతున్నారు. కూటమి పాలకుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ ధాన్యం విక్రయాల విషయంలో దళారుల బారిన పడి మోసపోతున్నాడు. మండలంలో ఆలస్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో తుఫాన్‌కు ముందే శివరాంపురం పంచాయతీ రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. మండలంలో కూర్మరాజుపేట, మామిడిపల్లి, కందులపదం తదితర పంచాయతీల్లో రైతులు నూర్పులు ముమ్మరంగా చేస్తున్నారు. ఇదే అదనుగా దళారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరను కాదని తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేక రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించేస్తున్నారు.

సవాలక్ష ప్రశ్నలు



కొనుగోలు కేంద్రానికి వెళ్తే అధికారులు తొలిత సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. బస్తా వద్ద రూ.200 కోసం ఆలోచిస్తే తోలిన ధాన్యంతో కేంద్రం వద్ద తడిగా ఉన్నాయనో.. లేకా ఏదో ఒక కారణంతో అడ్డుపడితే ఆ కష్టం భరించలేం. డబ్బులు తగ్గినా దళారులకు ఇవ్వడమే మేలు అనిపిస్తుంది. గతం లాగా సచివాలయాల్లో సరిగా సమాధానం చెప్పడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాలంటే అధికారుల నుంచి కూడా ఎలాంటి సహకారం అందడం లేదు. అందుకే దళారులను ఆశ్రయిస్తున్నాం.

– పల్లి సాంబమూర్తి, కూర్మరాజుపేట

సరైన సమాచారం ఇవ్వడం లేదు



ముమ్మరంగా ధాన్యం నూర్పులు చేస్తున్నాం. ఇలాంటి సమయంలో మా చుట్టూ వ్యాపారులు తిరుగుతున్నారు. అధికారులు మాత్రం కానరావడం లేదు. అలాంటప్పుడు ఎంతోకొంత నష్టపోయినా కూలీలు, సంచులు, లారీని వ్యాపారి తెచ్చుకుంటున్నాడు. ఈ బాధ్యతలు తాము భరించలేం. అందుకే దళారులకు అమ్ముకుంటున్నాం. అంతేకాకుండా కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యంతో వెళ్తే పలు రకాల ప్రశ్నలు వేస్తారు. అదే దళారీలైతే అలాంటి పరిస్థితులు ఉండవు.

– పల్లి బాబ్జి, కూర్మరాజుపేట

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కూటమి సర్కార్‌ను ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలదీస్తుందని, ఇందుకు సంబంధించి చేపట్టే నిరంతర పోరాటాలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధ్యక్షుడు అలజంగి జోగారావు కోరారు. రైతు సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వ తీరును నిలదీస్తూ శుక్రవారం చేపట్టనున్న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. తన స్వగృహంలో అన్నదాతకు అండగా కార్యక్రమానికి సంబంధించి గురువారం ఆయన నియోజకవర్గ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలైనా రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ధ్వజమెత్తారు.ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ ప్రారంభమైనా పెట్టుబడి సాయం అందజేయలేదని దుయ్యబట్టారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తామంటూ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను విస్మరించారని ధ్వజమెత్తారు. చివరకు ధాన్యం కొనుగోలులో కూడా అన్నదాతకు ప్రభుత్వం సహకరించడం లేదన్నారు.

అన్ని వర్గాలకు అన్యాయం

కూటమి సర్కార్ ఆరు నెలల పాలనలో అన్ని వర్గాలకు అన్యాయమే జరుగుతోందని, సీఎం చంద్రబాబు మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. వ్యవసాయం, వైద్య, విద్య రంగాలను పూర్తిగా విస్మరించిన కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, ప్రజల తిరుగుబాటు చవిచూస్తారని హెచ్చరించారు. దివంగత వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ కాలనీలకు 50 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించడం జరిగిందని, ఈ పథకాన్ని ఆయన తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేశారని గుర్తు చేశారు ప్రస్తుతం సీఎం చంద్రబాబు సర్దుబాటు అంటూ విద్యుత్ చార్జీల పెంపునకు సిద్ధం అయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దగా, మోసాలను ప్రజలకు తెలియజేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇందులో భాగంగా నేడు రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆందోళనలు చేపడుతుందని చెప్పారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాకు ప్రతి ఒక్కరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికి పాలకులు పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో మన్యం జిల్లా పూర్తిగా వెనుకబాటుకు గురైందని, పాలకుల చిత్తశుద్ధి లేమికి గిరిజనులు, ప్రజలు నష్టపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో నూతన జిల్లా కమిటీ సభ్యులతో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం పదో జిల్లా మహాసభలు కురుపాం కేంద్రంగా ఈ నెల 10, 11 తేదీల్లో 150 మంది ప్రతినిధులతో జరిగిందన్నారు. మహాసభల్లో మూడేళ్ల కాలంలో సీపీఎం చేపట్టిన పోరాట, రాజకీయ, నిర్మాణ అంశాలపై చర్చించిందన్నారు. భవిష్యత్ పోరాటాలకు, జిల్లా సమగ్ర అభివృద్ధికి అనేక తీర్మానాలు చేసినట్టు చెప్పారు. జిల్లాలో విద్య, వైద్యం, ప్రాజెక్టు నిర్మాణాలు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయని పేర్కొన్నారు. పార్వతీపురం మెడికల్ ఆస్పత్రి పనులు నత్తనడకన కొనసాగుతుందని వెంటనే పూర్తి చేయాలన్నారు. కురుపాం, సీతంపేట, సాలూరు నియోజకవర్గ కేంద్రాల్లో వంద పడకల ఆస్పత్రులు నిర్మించాలని తీర్మానించినట్టు చెప్పారు. మన్యం జిల్లా అభివృద్ధికి పాలకులు దృష్టి సారించాలని లేకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కె.రామస్వామి మరియు జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, గొర్లి వెంకటరమణ, కొల్లి సాంబమూర్తి, మండంగి రమణ, బి.వెంకటరమణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

పత్రాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం మండల కేంద్రంలోని సువర్ణముఖి నది తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి పత్రాలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావడం, స్వామివారిని దర్శించుకుంటే కోరికలు తీరుతాయన్న నమ్మకంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు స్వామికి అర్చకులతో ప్రత్యేక అలంకరణ చేశారు.

– సీతానగరం



ఆర్టీసీ డీఎం తీరుపై నిరసన



ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ ఆర్టీసీ సాలూరు డిపో మేనేజర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆర్టీసీలో ఎస్ఎంయూ, ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ సెక్రటరీ సుందరరావు, సెక్రటరీలు ఎంఎస్ నారాయణ, పి.శేఖర్ ధ్వజమెత్తారు. డీఎం తీరును నిరసిస్తూ ఆర్టీసీ డిపో వద్ద కార్మికులతో కలిసి గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపో మేనేజర్ నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది మందిని తొలగించారని ఆరోపించారు. నూతన చార్టులు వేయాలని రెండేళ్లుగా డిపోలో రెండు యూనియన్లు లేఖలు ఇచ్చినా చార్టి విషయంలో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. డీఎం తీరును నిరసిస్తూ గురువారం నుంచి నాలుగు రోజులు కార్మికుల గేట్ మీటింగ్ ధర్నాలు చేపడుతున్నట్టు తెలిపారు. సంఘాల నాయకులు డీఎస్ రావు, పి.సుందరరావు, త్రినాథ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

– సాలూరు

రాజకీయ వేధింపులు తగవు



డీఈఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న శ్రామిక మహిళా నాయకులు

పార్వతీపురం టౌన్: కేజీబీవీలో పని చేస్తున్న డైలీ వేజ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకొని తొలగించిన కేజీబీవీ డైలీ వేజ్ ఉద్యోగులను తిరిగి నియమించాలని శ్రామిక మహిళా జిల్లా నేత వాకాడ ఇందిర డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఏడీఈఓకు మక్కువ మండలం కాశీపట్నం గ్రామానికి చెందిన డైలీ ఉద్యోగి తోనంగి జ్యోతి, పాచిపెంట మండలం కేజీబీవీలో పని చేస్తున్న డైలీ వేజ్‌లు అమ్మ కుమార్, లావణ్యలతో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలను పాటించకుండా రాజకీయ వేధింపులతో డైలీ వర్కర్లను తొలగించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కక్ష పూరిత చర్యలు మానుకోవాలని కోరారు. సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

పార్వతీపురం టౌన్: భాస్కర్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బాలగుడబ సమీపంలో స్కూల్ బస్సు బోల్తా పడిందన్నారు. ఈ ప్రమాదంలో క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందడం బాధాకరమన్నారు. కొందరు విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని పేర్కొన్నారు. డ్రైవర్ మద్యం మత్తు వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. చెడు అలవాట్లు ఉన్న వారిని డ్రైవర్లగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భీమరాజు, సహాయ కార్యదర్శులు హరికృష్ణ, దుర్గాప్రసాద్, మండల నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

మక్కువ: దబ్బగెడ్డ పంచాయతీ, బోరింగువలస గ్రామానికి చెందిన ఓవ్యక్తి ధాన్యం నూర్పుడు యంత్రం వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కుడిచేయి నుజ్జునుజ్జయింది. గ్రామానికి చెందిన తాడంగి కృష్ణ గురువారం ఉదయం గ్రామం సమీపంలోని పంటపొలాల్లో నూర్పుడు యంత్రంతో ధాన్యం నూర్చే పనులు జరిపిస్తున్నాడు. ప్రమాదవశాత్తు యంత్రంలో అతని కుడిచెయ్యి పడడంతో నుజ్జునుజ్జయింది.

సంస్కృతోన్నత పాఠశాలకు బహుమతుల పంట



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పార్వతీపురం టౌన్: వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గీతా సమావేశ మందిరం వారు విద్యార్థులకు గురువారం నిర్వహించిన భగవద్గీత శ్లోక పఠన పోటీల్లో జిల్లా పరిషత్ సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థులు పలు బహుమతులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. సీనియర్స్, జూనియర్స్ రెండు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి అనుపోజు తన్మయి, ద్వితీయ బహుమతి వాండ్రాసి సాయిశ్రీ,, తృతీయ బహుమతి అంకం ఝాన్సీ పొందగా, జూనియర్స్ విభాగంలో వాండ్రాసి నిహారిక ప్రథమ, తాడ్డి హరిప్రియ ద్వితీయ, కె.లలిత కామాక్షి తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. గీతా సమావేశ మందిరం నిర్వాహకులు గడ్డ సత్యనారాయణ, వాసు, వినాయక మహారాణా, ప్రముఖ సాహితీవేత్త బెహరా ఉమామహేశ్వరరావు, శ్రీమాన్ కుమారభట్టర్ గోపీనాథచార్యులు బహుమతి ప్రదానం చేసారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్జ హేమ సుందరరావునాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు భగవద్గీతా పఠనం చాలా అవసరమని, కర్తవ్య బోధ చేస్తుందన్నారు. విద్యార్థులను తయారుచేసిన సంస్కృత పండితులు జేబీ తిరుమలాచార్యులను అభినందించారు.